# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-06-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన ప్రజల నమ్మకానికి, రాష్ట్ర అభివృద్ధికి, పేదల సంక్షేమానికి అద్దం పట్టిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

2. **రాజధాని అమరావతి పరిధిలోని మోతడక గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం తక్షణమే నిధులను విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ అధికారులను ఆదేశించారు.**

3. **తెలంగాణలోని ఎయిర్ ఫోర్స్ అకాడమీలో సంయుక్త గ్రాడ్యుయేషన్ పరేడ్‌కు కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ రోజు హాజరవుతారు.**

4. **రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి ఆవిష్కరణల కేంద్రంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు.**

==========================

కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన ప్రజల నమ్మకానికి, రాష్ట్ర అభివృద్ధికి, పేదల సంక్షేమానికి అద్దం పట్టిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతూ, రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా నడిపిస్తున్నామని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా వెల్లడించారు. గత రెండేళ్లుగా రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రజలు భాగస్వాములయ్యారని, అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన ధ్యేయాలుగా ప్రజా క్షేమమే పరమావధిగా నవ్యాంధ్ర ప్రగతి రథాన్ని ముందుకు నడిపేందుకు పునరంకితం అవుతున్నట్లు తెలిపారు. తిరుపతిలో నిన్న నిర్వహించిన 2 ఏళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం విజయోత్సవ సభను జయప్రదం చేసిన ప్రజలకు ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలియజేశారు.

--------------------------

రాజధాని అమరావతి పరిధిలోని మోతడక గ్రామంలో రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం కోటి 26 లక్షలను తక్షణమే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు. గ్రామాభివృద్ధికి అవసరమైన చర్యలను వేగంగా చేపట్టాలని సూచించారు. గ్రామంలో నిన్న పర్యటించిన, ఆయన గ్రామ సభలో భాగంగా రైతులతో సమావేశమయ్యారు. గ్రామసభకు స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, సీఆర్డీయే అడిషనల్ కమిషనర్ భార్గవ్ తేజ, తదితరులు హాజరయ్యారు.

--------------------------

తెలంగాణలోని దుండిగల్‌లో ఉన్న ఎయిర్ ఫోర్స్ అకాడమీలో సంయుక్త గ్రాడ్యుయేషన్ పరేడ్ ను ఈరోజు నిర్వహించనున్నారు. వైమానిక దళ క్యాడెట్ల ప్రీ – కమిషనింగ్ శిక్షణ పూర్తైన సందర్భంగా ఈ పరేడ్ జరగనుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని వెల్లడించారు.

-------------------------

సౌత్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథూర్ విజయవాడ – గూడూరు రైల్వే సెక్షన్‌లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. విజయవాడ డివిజన్ డీఆర్ఎం మోహిత్ సోనాకియాతో కలిసి కృష్ణా కెనాల్ – పెద్దవడ్లపూడి మధ్య మూడో లైన్ పనులు, అలాగే తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు రైల్వే స్టేషన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన నిన్న సమీక్షించారు. బిట్రగుంట క్రూ లాబీలో సిబ్బంది సంక్షేమ సదుపాయాలను పరిశీలించారు. మౌలిక వసతుల అభివృద్ధి, భద్రతా ప్రమాణాల పెంపు, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సందీప్ మాథూర్ సూచించారు.

-------------------------

విద్యా, పరిశోధనా సంస్థలు, పరిశ్రమల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి ఆవిష్కరణల కేంద్రంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. విశాఖపట్నంలో నిన్న నిర్వహించిన 'డిజి 100 ఎక్స్' కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా నాయకత్వ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ..

వాయిస్...30 సెకన్లు

-------------------------

తెలంగాణ పల్లెలపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేక దృష్టి సారించారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు. పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా, వలసల తగ్గింపు వంటి లక్ష్యాలతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. ఈ పథకంలో భాగంగా గత 12 ఏళ్లలో తెలంగాణకు 143 కోట్ల 23 లక్షల పనిదినాలు కల్పించినట్లు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఫలితంగా కార్మికులకు 34 వేల 639 కోట్ల రూపాయల వేతనాలు చెల్లించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఉపాధి కల్పన, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల కోసం కేంద్రం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

-------------------------

కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సిపి అధినేత వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి ఆరోపించారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు సహా అన్ని వర్గాలను ప్రభుత్వం మోసం చేసిందని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం పేరుతో ప్రచారం మాత్రమే జరిగిందని, శాంతిభద్రతలు క్షీణించాయని, మహిళలు, చిన్నారుల భద్రత ప్రశ్నార్థకంగా మారిందని చెప్పారు. విద్యుత్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు, బస్సు ఛార్జీలు పెరగడంతో ప్రజలపై ఆర్థిక భారం అధికమైందని ఆరోపించారు.

-------------------------

రక్తదానం ప్రాణ దానంతో సమానమని అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. అనంతపురం జిల్లా ఆవులదట్ల గ్రామంలో ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ సహకారంతో నిన్న నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

వాయిస్...25 సెకన్లు

---------------------------

కృత్రిమ మేధ, డ్రోన్లు, యాంత్రీకరణతో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు రావాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నిన్న నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత వ్యవసాయ అవసరాలకు అనుగుణంగా కొత్త మార్పులకు దిక్సూచిగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నిలవాలని సూచించారు. వ్యవసాయ రంగంలో తెలంగాణ పురోగమిస్తుందని, అది ఉత్పత్తికే పరిమితం కాకుండా ప్రాసెసింగ్, మార్కెటింగ్, ఎగుమతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు.

---------------------------

వచ్చే నెల 1వ తేదీ నుంచి అమలులోకి రానున్న వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్, ఆజీవిక మిషన్ గ్రామీణ్ – వీబీ జీ రాం జీ అమలుకు సన్నద్ధం కావాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు, అదనపు సమన్వయకర్తలు, అనుబంధ శాఖల అధికారులకు ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ షణ్ముఖ్ కుమార్ సూచించారు. విజయవాడలో నిన్న నిర్వహించిన రాష్ట్ర స్థాయి సదస్సులో అధికారులకు వీబీ జీ రాంజీ అమలుకు సంబంధించి కేంద్రం జారీ చేసిన మార్గదర్శకాలను వివరించారు.

---------------------------

ఖరీఫ్ సాగుకోసం రైతులకు ప్రభుత్వం రాయితీపై అందించే వేరుశనగ విత్తనాలు ఈ రోజు నుంచి రైతు సేవా కేంద్రాల్లో పంపిణీ చేయనున్నట్లు అనంతపురం జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.సాలురెడ్డి తెలిపారు. ఇప్పటి వరకూ వరకు 19 వేల 221 మంది రైతులు విత్తనాల కోసం పేర్లు నమోదు చేసుకున్నారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

---------------------------

నైరుతి రుతుపవనాలు వాయువ్య బంగాళాఖాతమంతటా, పశ్చిమ–మధ్య బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలకు విస్తరించాయని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. ఉత్తర కోస్తా తమిళనాడుపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని వాతావరణ కేంద్రం అధికారి నారాయణ పేర్కొన్నారు. దక్షిణ కోస్తా, దాని పరిసర ప్రాంతాలపై మరో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని వివరించారు. వీటి ఫలితంగా ఉత్తర కోస్తా, యానాంలలో ఈరోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని పేర్కొంటూ..

వాయిస్...27 సెకన్లు

మరోవైపు తెలంగాణలో ఈ రోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొన్ని చోట్ల కురిసే అవకాశం ఉందని హైదరాబాదు వాతావరణ కేంద్రం వెల్లడించింది.

=====================